దక్షిణమధ్య రైల్వే సిబ్బందికి 7 జాతీయ పురస్కారాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ సిబ్బందికి జాతీయ స్థాయిలో 'అతి విశిష్ట రైల్ సేవా పురస్కార్-2023' పేరుతో ఏడు అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను ఈ నెల 15న న్యూఢిల్లీలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేతులమీదుగా ప్రదానం చేయనున్నారు. డీఎస్ రామారావు, సీహెచ్ దినేశ్‌రెడ్డి, మల్లెల శ్రీకాంత్, సీ శివకుమార్ కశ్యప్, టీ ప్రత్యూష, టీ నటరాజన్, వీవీ రంగయ్య ఈ జాతీయ అవార్డులకు ఎంపికయ్యారు.

రేపటి నుంచి 14 ప్రత్యేక రైళ్లు

వివిధ రైల్వేస్టేషన్ల నుంచి 14 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు బుధవారం నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నుంచి జనవరి 1 వరకు వారణాసి నుంచి ఎంబీఆర్ సెంట్రల్, కన్యాకుమారి, కోయంబత్తూరు నడుమ ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని తెలిపారు. పూర్తి వివరాలు రైల్వే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి :యూటీఎఫ్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): టీచర్ల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ కోరింది. బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన సంఘం నేతలు నూతన ప్రభుత్వం విద్యారంగం బలోపేతానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్‌ను రద్దుచేయాలని, జీవో-317 బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జంగయ్య, చావ రవి, లక్ష్మారెడ్డి, వెంకట్, గాలయ్య, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టర్లకు టీటీడీ నిధులా?

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): టీటీడీకి వస్తున్న నిధులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తప్పుపట్టింది. టీటీడీకి వస్తున్న నిధుల్లో ఒక శాతం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయిస్తామని ప్రకటించి.. రూ.100 కోట్లు పారిశుధ్య పనుల కోసం మళ్లించింది. ఈ చర్య సబబు కాదని పేర్కొంటూ బీజేపీ నాయకుడు భానుప్రకాశ్‌రెడ్డి ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం కేసు విచారణకు రాగా, ఆలయ నిధులు మళ్లించడం దేవాదాయ చట్టం సెక్షన్ 111కు విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. రెండు వారాల్లోగా టీటీడీ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

డ్రగ్స్ విక్రేతలు నగరాన్ని వీడాల్సిందే

క్విక్ రెస్పాన్స్‌కు ప్రాధాన్యం

డ్రగ్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

- సినీరంగం, పబ్‌లలోనే డ్రగ్స్ వాడకం
- ఫ్రెండ్లీ పోలీసింగ్ అవహేళనకు గురైంది
- చట్టాన్ని గౌరవించే వారితోనే ఫ్రెండ్లీ పోలీసింగ్
- హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. డ్రగ్స్ విక్రేతలు హైదరాబాద్ విడిచి వెళ్లాలని, లేదంటే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. హైదరాబాద్ సీపీగా నియమితులైన ఆయన బుధవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో మాజీ కమిషనర్ సందీప్ శాండిల్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ మహానగరంలో విధి నిర్వహణ సవాళ్లతో కూడుకున్నదని తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ గ్యాంబ్లింగ్, డ్రగ్స్ లాంటి సమాజానికి హానిచేసే వాటిని నిర్మూలిస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. క్విక్ రెస్పాన్స్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తామని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు భరోసా కల్పిస్తామని తెలిపారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌ను పూర్తిగా నిరోధించేందుకు షీటీమ్స్‌తో కలిసి ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ జీవనదిలాంటిదని పేర్కొన్న సీపీ.. దానిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా పని చేసిన అనుభవం తనకు కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డ్రగ్స్ వినియోగాన్ని ప్రోత్సహించవద్దు

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని సీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. యువతను నాశనం చేసే డ్రగ్స్ వంటి మహమ్మారిని కూకటివేళ్లతో నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సైబరాబాద్, రాచకొండ పోలీసుల సమన్వయంతో మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. డ్రగ్స్ వాడకం లేకుంటే సరఫరా కూడా ఉండదని, డ్రగ్స్ నిర్మూలనకు గత పోలీస్ కమిషనర్ల హయాంలో అనేక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. డ్రగ్స్ విక్రయించే ముఠాలు నగరాన్ని, రాష్ట్రాన్ని విడిచి వెళ్లాలని ఆదేశించారు. లేదంటే పోలీసులు వదలరని హెచ్చరించారు. పబ్‌లు, రెస్టారెంట్లతోపాటు సినిమా రంగంలోనూ డ్రగ్స్ వినియోగం ఎక్కువగా ఉన్నట్టు సమాచారం ఉన్నదని, ఇలాంటివి ప్రోత్సహించవద్దని యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశారు. త్వరలోనే చిత్ర పరిశ్రమ పెద్దలతో పాటు యూనియన్లు, పబ్‌ల యాజమాన్యాలతో సమావేశమవుతామన్నారు.

చట్టాన్ని గౌరవిస్తేనే స్నేహం

పోలీసులు అందరితో ఫ్రెండ్లీగా ఉండటంతో ఫ్రెండ్లీ పోలీసింగ్ అవహేళనకు గురైందని సీపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై చట్టాన్ని గౌరవించేవారితోనే స్నేహంగా ఉంటామని, వారి సహాయ సహకారాలు తీసుకుంటామని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించే వారితో మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఉద్దేశపూర్వక నేరాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో దర్యాప్తు పక్కదారి పట్టిన కేసులను బయటకు తీసి సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసు అధికారులను కూడా వదిలిపెట్టబోమని హెచ్చరికలు జారీ చేశారు.

సైబర్ క్రైం దర్యాప్తుల్లో తెలంగాణ టాప్

సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారని సీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనిని ఇలాగే కొనసాగిస్తూ మరింత పకడ్బందీగా ముందుకెళ్తామన్నారు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటున్న తాము వారికి మరింత మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. తనతోపాటు ప్రతి ఒక్క అధికారి ప్రజలకు అందుబాటులో ఉంటారని సీపీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో అదనపు సీపీలు విక్రమ్‌సింగ్‌మాన్, విశ్వప్రసాద్, జాయింట్ సీపీలు పరిమళ హనా నూతన్, గజరావు భూపాల్, డీసీపీ జోయెల్ డేవిస్ పాల్గొన్నారు.

డీఎడ్ ప్రవేశాలపై గందరగోళం

క్వాలిఫై అయినవారి వివరాలు

మీడియం	దరఖాస్తు చేసినవారు	పరీక్షకు హాజరైనవారు	క్వాలిఫై అయినవారు (శాతం)
తెలుగు	2,575	2,043	1,551(75.91%)
ఇంగ్లిష్	3,213	2,495	2,114(84.72)
ఉర్దూ	697	310	310(50.65)

- కాలేజీల వివరాలివ్వని ఎస్సీఈఆర్టీ
- సీట్లు కేటాయించని అధికారులు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన డీఈఈసెట్ కౌన్సెలింగ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో కౌన్సెలింగ్ తీవ్ర జాప్యం అవుతున్నది. డిసెంబర్ సగం గడిచినా కౌన్సెలింగ్ ప్రారంభం కాకపోవటంతో విద్యాసంవత్సరం కోల్పోవాల్సి వస్తుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సీఈఆర్టీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపిస్తున్నారు. డీఈఈసెట్ ఎగ్జామ్‌ను జూన్ 1న నిర్వహించారు. జూన్ 8న ఫలితాలు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో క్వాలిఫై అయిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, సీట్లు కేటాయించాల్సి ఉండగా, జూన్ నుంచి ఇంత వరకు కౌన్సెలింగ్‌ను చేపట్టలేదు. డీఈఈసెట్‌లో క్వాలిఫై అయినవారంతా కౌన్సెలింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందా? సీట్లు ఎప్పుడు కేటాయిస్తారా? అని వేచిచూస్తున్నారు. డీఎడ్ కాలేజీలకు ఎస్సీఈఆర్టీ అధికారులు గుర్తింపును జారీచేసి, ఆయా కాలేజీలు సీట్ల వివరాలను డీఈఈసెట్ కన్వీనర్‌కు అప్పగిస్తారు. ఈ వివరాలతో మెరిట్ ప్రకారం సీట్లను కేటాయిస్తారు. ఎస్సీఈఆర్టీ అధికారులు ఈ ప్రక్రియను ఇప్పటి వరకు పూర్తిచేయలేదు. దీంతోనే ఈ కౌన్సెలింగ్ ఆలస్యమవుతున్నది. ఇప్పటికిప్పుడు సీట్లు భర్తీ చేసినా, విద్యాసంవత్సరం సజావుగా కొనసాగే అవకాశాలు కనిపించటం లేదు. ఒక వేళ కౌన్సెలింగ్ చేపట్టినా, వేసవిలో క్లాసులు నిర్వహించాల్సి ఉంటుందని కాలేజీల నిర్వాహకులు చెప్తున్నారు.

16న బడుల్లో పేరెంట్ టీచర్ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యలో తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించేందుకు 16న పేరెంట్ టీచర్ సమావేశాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన ఆదేశించారు. విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించాలని తెలిపారు.

15 నుంచి పీహెచ్‌డీ ప్రవేశాలకు కౌన్సెలింగ్

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 13: 2023-24 సంవత్సరానికి పీజీ, పీహెచ్‌డీలో ప్రవేశాలకు 15 నుంచి 18 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రి వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటరమణ తెలిపారు. బుధవారం ఆయన వర్సిటీలో ప్రవేశ పరీక్ష కౌన్సెలింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు.

విద్యా - ఉద్యోగ సమాచారం

18న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

యువతకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): వరంగల్ మడికొండలోని ఐటీ-సెజ్‌లో క్వాడ్రంట్ ఆఫీస్‌లో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టెక్ మహీంద్రా, జెన్‌ప్యాక్, క్వాడ్రంట్, వరుణ్ మోటర్స్, అపోలో, టాటా స్ట్రైవ్, వన్‌స్టాప్, వీ3టెక్, ఏఆర్ఎస్ వంటి 35 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నట్టు ఆయన బుధవారం ఎక్స్ ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా 1,500 నుంచి 2వేల మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నదని కేటీఆర్ తెలిపారు.

టీ హబ్‌లో ఫాల్కన్‌ఎక్స్ యాక్సిలరేటర్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): టీ హబ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్టార్టప్‌లకు అమెరికాలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు వీలుగా ఫాల్కన్‌ఎక్స్ యాక్సిలరేటర్‌ను ఏర్పాటు చేశారు. అమెరికాకు చెందిన ఫాల్కన్‌ఎక్స్ కంపెనీ టీ హబ్‌తో కలిసి ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసింది. ఈ వేదిక ద్వారా రెండు దేశాల్లో ఉన్న స్టార్టప్‌లు మార్కెట్లోకి సులభంగా ప్రవేశించేందుకు అవసరమైన సహాయసహకారాలను అందిస్తారు. ఫాల్కన్‌ఎక్స్ యాక్సిలరేటర్ మెంబర్‌షిప్ తీసుకొంటే స్టార్టప్‌లకు.. మెంటార్‌షిప్, పరిశ్రమలతో అనుసంధానం, పెట్టుబడిదారులతో సమావేశం అయ్యేందుకు అవకాశం కల్పిస్తారు. వివరాలకు https://bit.ly/3uMf8Jf లింకును సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ప్రపంచ నైపుణ్య పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ): వరల్డ్ స్కిల్ కాంపిటీషన్-2024లో పాల్గొనే ఔత్సాహికులు ఈ నెల 20లోపు www. skillindiadigital. gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఫ్రాన్స్‌లో స్కిల్ ఇండియా డిజిటల్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జిల్లా, రాష్ట్ర, ప్రీ-నేషనల్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిల్లో జరుగుతాయని వారు తెలిపారు. ఆటోబాడీ రిపేర్, ఆటోమొబైల్ టెక్నాలజీ, బేకరీ, బ్యూటీథెరపీ, సీఎన్‌సీ మిల్లింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఐటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఫర్ బిజినెస్ తదితర దాదాపు 50కి పైగా నైపుణ్యాలలో ఈ పోటీలు ఉంటాయని వివరించారు. అర్హత ఉన్న అభ్యర్థులు వీటిల్లో పోటీపడవచ్చని సూచించారు.

రేపటి నుంచి బీసీ ఓవర్సీస్ సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, డిసెంబర్13 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈ నెల 15 నుంచి చేపట్టనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ వెల్లడించింది. పథకం కింద ఆర్థిక సాయానికి మొత్తం 2,665 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొన్నారని తెలిపింది. వీరిలో 2,023 మంది అభ్యర్థులు బీసీ వారు కాగా, 642 మంది ఈబీసీ అభ్యర్థులున్నారని వివరించింది. అభ్యర్థులు నిర్దేశిత తేదీల వారీగా మాసబ్ ట్యాంక్ వద్ద ఉన్న సంక్షేమభవన్, ఆరో అంతస్తుకు పూర్తి సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించింది. వివరాలకు https:// telanganaepass. cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరింది.

13 పట్టణాల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా కేంద్రాలు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలను రాష్ట్రంలోని 13 పట్టణాల్లో నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది మే 26న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లల్లో పరీక్షలు జరుగుతాయి. ఇటీవలే పరీక్షలను నిర్వహించే పట్టణాల జాబితాను ఐఐటీ మద్రాసు వెల్లడించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్‌లలో పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఐఐటీ మద్రాసు తెలిపింది.

టీచర్ల కోసం 'యాడ్ ఆన్ కోర్సులు'

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): టీచర్లు తమ అభిరుచిని బట్టి నైపుణ్యం పెంచుకొనే దిశలో యాడ్ ఆన్ కోర్సులను ప్రవేశపెట్టాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) నిర్ణయించింది. ఇటీవల నిర్వహించిన ఎన్సీటీఈ 59వ జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నది. ఇందుకు ఒక కమిటీని నియమించనున్నది. ఈ కమిటీ సూచనల మేరకు కొత్త కోర్సులను అందుబాటులోకి తెస్తారని ఎన్సీటీఈ వర్గాలు వెల్లడించాయి.

15న వాల్యూ జోన్ హైపర్ మార్ట్

ప్రారంభించనున్న సినీహీరో నందమూరి బాలకృష్ణ

హైదరాబాద్, డిసెంబర్ 13: ప్రముఖ రిటైల్ సంస్థ వాల్యూ జోన్..హైదరాబాద్‌లో హైపర్ మార్ట్‌ను ప్రారంభించబోతున్నది. పటాన్‌చెరు వద్ద ఏర్పాటు చేసిన ఈ హైపర్ మార్ట్‌ను ప్రముఖ సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఈ నెల 15న ప్రారంభించనున్నారు. నగరవాసులకు సరికొత్త షాపింగ్ అనుభవం కల్పించాలనే ఉద్దేశంతో ఈ హైపర్ మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. షాపింగ్ అంటే కేవలం వస్తువులను కొనుగోలు చేయడం మాత్రమే కాదని. ఒక అనుభవంగా ఊహించుకునేందుకుగాను సరికొత్తగా డిజైన్ చేసినట్లు వెల్లడించింది. కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి 40 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపింది.

'ఒమన్ ఎయిర్' సరుకు రవాణా సేవలు ప్రారంభం

శంషాబాద్ ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ పాణికర్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఒమన్ ఎయిర్‌వేస్ సంస్థ సరుకు రవాణా సేవలను ప్రారంభించిందని ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ పాణికర్ తెలిపారు. హైదరాబాద్-- మస్కట్‌లను కలుపుతూ బోయింగ్ బి737-800 బీసీఎఫ్ విమానం సరుకును రవాణా చేస్తుందని వెల్లడించారు. ఈ విమానం హైదరాబాద్ నుంచి ప్రతి మంగళ, శనివారాల్లో మధ్యాహ్నం 2 గంటలకు బయలు దేరుతుందని చెప్పారు. నగరం నుంచి ఔషధాలు, గుడ్ల ఎగుమతులను పెంచేందుకు ఈ సర్వీసు దోహదపడుతుందని తెలిపారు. ఈ కొత్త కనెక్టివిటీ ఒమన్,అమెరికా, ఐరోపాకు ఫార్మా ఎగుమతులను పెంచుతుందని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
ఇరిగేషన్ మరియు CAD శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

క్ర.సం.1 టెండరు ప్రకటన నం. 11/2023-24, తేది: 11.12.2023, పని పేరు: FDR 2023-24- జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మొగుళ్ళపల్లి (మం), కొరికశాల(గ్రా) దగ్గర కొరికశాల Mott ఇరిగేషన్ ఛానల్ స్ట్రీమ్ క్రాసింగ్ యొక్క రక్షణ గోడలకు శాశ్వత మరమ్మతులు. పని అంచనా కాంట్రాక్ట్ విలువ (రూపాయలలో): రూ. 27,95,982/-, క్ర.సం.2. టెండరు ప్రకటన నం. 14/2023-24, తేది: 11.12.2023, పని పేరు: FDR 2023-24-జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మొగుళ్లపల్లి (మం), పోతుగల్లు (గ్రా), పెద్ద చెరువుకు శాశ్వత మరమ్మతులు. పని అంచనా కాంట్రాక్ట్ విలువ (రూపాయలలో): రూ. 24,85,332/-. టెండరు డాక్యుమెంట్లు 14.12.2023న ఉ. 11.00 గం. నుండి లభిస్తాయి. మరిన్ని వివరాలు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కొరకు వెబ్‌సైట్: www.eprocurement.gov.in దర్శించగలరు.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, ములుగు

DIPR RO No.8609-PP/CL/Advt/1/2023-24, Dt: 13.12.2023

పురపాలక సంఘ కార్యాలయము: బెల్లంపల్లి: జిల్లా: మంచిర్యాల
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్

ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ నెం.ఇ1/07/టెండర్/2023-24/Bpl/Mptly తేది: 13-12-2023

ఈ కార్యాలయములో అంచనా విలువ రూ. 279.39 లక్షల విలువగల(11) పనులకు పట్టణ ప్రగతి నిధులకుగాను రిజిస్టర్డ్ సివిల్ కాంట్రాక్టర్స్ వారి నుండి ఈ కార్యాలయం ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి. **టెండర్ తేదీల వివరములు:** 01. డౌన్‌లోడ్ మొదలు తేది & సమయం: 13-12-2023 from 04.00 PM, 02. డౌన్‌లోడ్ చివరి తేది & సమయం: 27-12-2023 up to 04.00 PM. ఇట్టి విషయములో తదుపరి సమాచార నిమిత్తము ఆఫీసు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయము నందు సంప్రదించగలరు లేదా 8712333442 నందు సంప్రదించగలరు. పూర్తి వివరములకు website: www.tender.telangana.gov.in నందు చూడవచ్చును.

సం/- కమిషనర్, బెల్లంపల్లి మున్సిపాలిటీ

DIPR RO.No.8622-PP/CL/ADVT/1/2023-24, 13-12-2023

రికార్డు కనిష్ఠానికి రూపీ

83.40 వద్ద ముగిసిన కరెన్సీ

ముంబై, డిసెంబర్ 13: రూపాయి మారకపు విలువ మూడు వారాల క్రితం నమోదుచేసిన రికార్డు కనిష్ఠస్థాయికి తిరిగి బుధవారం మరోసారి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ (ఫారెక్స్)లో బలహీనంగా ప్రారంభమైన రూపాయి ఇంట్రాడేలో ఆల్‌టైమ్ కనిష్ఠస్థాయి 83.42 వద్దకు పడిపోయి, చివరకు క్రితం ట్రేడింగ్ రోజుతో పోలిస్తే 3 పైసలు నష్టపోయి 83.40 వద్ద ముగిసింది. గత నవంబర్ 24న ఇదేస్థాయి వద్ద భారత కరెన్సీ నిలిచింది. అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని వెల్లడించనున్న నేపథ్యంలో డాలరు బలపడిందని, దీంతో రూపాయి తగ్గిందని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. రిటైల్ ద్రవ్యోల్బణం నవంబర్ నెలలో 5.55 శాతానికి పెరగడం సైతం కరెన్సీపై ప్రతికూల ప్రభావం చూపించిందన్నారు. ప్రపంచ మార్కెట్లో బ్యారల్ ముడి చమురు ధర 73 డాలర్ల వద్దకు తగ్గిన కారణంగా రూపాయి క్షీణత పరిమితంగా ఉందని ట్రేడర్లు వివరించారు. తాజాగా డాలర్ ఇండెక్స్ 0.5 శాతం పెరిగి 104.50 వద్ద కదులుతున్నది.

83.20-83.70 శ్రేణి మధ్యలో ఒడిదుడుకులు

యూరో, జపాన్ యెన్‌లు లాభపడుతున్న కారణంగా డాలర్ ఇండెక్స్ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నదని, సమీప భవిష్యత్తులో రూపాయి సైతం 83.20-83.70 నిర్ణీత శ్రేణిలో ఒడిదుడుకులకు గురవుతుందని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి అంచనా వేశారు. రూపాయి మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయని, 83.50 స్థాయి వద్ద మద్దతు ఉన్నదని, ఈ స్థాయిని బ్రేక్‌చేస్తే మరింత బలహీనపడి వచ్చే కొద్ది రోజుల్లో 83.90-84.20 శ్రేణి వరకూ తగ్గవచ్చని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు.

హైదరాబాద్‌లో డ్రింక్‌ప్రైమ్ మరో యూనిట్

హైదరాబాద్, డిసెంబర్ 13: టెక్నాలజీ ఆధారంగా నీటిని శుద్ధి చేసి కొనుగోలుదారులకు అందిస్తున్న డ్రింక్‌ప్రైమ్ తాజాగా హైదరాబాద్‌లో మరో యూనిట్‌ను ప్రారంభించింది. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా ప్రజలకు స్వచ్ఛమైన, శుభ్రమైన తాగునీరును అందించడానికి ఈ కొత్త యూనిట్‌ను నెలకొల్పినట్టు కంపెనీ కో-ఫౌండర్, సీఈవో విజేందర్ రెడ్డి తెలిపారు. ఈ సంస్థ 2016లో టీ-హబ్ వేదికగా ప్రారంభమైన విషయం తెలిసిందే.

స్వల్ప లాభాల్లో మార్కెట్లు

ముంబై, డిసెంబర్ 13: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాల నుంచి తేరుకుని స్వల్ప లాభాలను అందుకోగలిగాయి. ఉదయం ఆరంభం నుంచీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్న సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో గట్టెక్కాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ ద్రవ్యసమీక్ష జరుగుతున్న నేపథ్యంలో మదుపరులు ఆచితూచి అడుగులేశారు. ఈ క్రమంలోనే తీవ్ర ఒడిదుడుకులు చవిచూడాల్సి వచ్చింది. అయినప్పటికీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 33.57 పాయింట్లు లేదా 0.05 శాతం పెరిగి 69,584.60 వద్ద ముగిసింది. అయితే ఒకానొక దశలో మాత్రం 450.47 పాయింట్లు పడిపోవడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ సైతం 19.95 పాయింట్లు లేదా 0.10 శాతం పెరిగి 20,926.35 వద్ద నిలిచింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.06 శాతం, స్మాల్‌క్యాప్ 0.73 శాతం చొప్పున పెరిగాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.

టెస్లాకు షాక్

ఈవీలపై దిగుమతి సుంకాలు తగ్గవ్

సబ్సిడీలిచ్చే ప్రతిపాదనేదీ లేదన్న కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: అమెరికా ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) తయారీ దిగ్గజం టెస్లాకు మోదీ సర్కారు షాకిచ్చింది